

# ఈ వారం సంతే

ఎమ్ హేమలత

అయిదు పైసలిచ్చి కొత్తిమిరి కట్ట కొంటున్న అరుణ. తన భుజంపై బలంగా చేయి పడడంతో వులిక్కిపడి, వెనక్కి తిరిగి చూసింది. చిరునవ్వుతో నిల్చున్న కోమలి. "హల్లో...! అరుణా!! ఎంతటి సుదినమీ రోజు?" అంటూ ఆప్యాయంగా పల్కరించింది. చిన్ననాటి చెలిమి తెలిదరూ కబుర్లలోపడ్డారు. అరుణా. కోమలి స్కూలుమేట్స్ కాక కాలేజీ మేట్సు కూడా. ఇద్దరి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ఎవరిదారి వారిదయింది. అరుణ కాలేజి లెక్చరరు గోపాలరావును వివాహమాడి హైదరాబాదు వాసి అయింది. కోమలికి వివాహమయ్యాక సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగిఅయిన భర్తతోపాటు నార్త్ ఇండియాలోనే వుండిపోయింది.

రేసిడెన్సీ దగ్గరి రోడ్డుపైన వెలసిన కూరగాయల మార్కెట్టు చాలా రద్దీగా వుంది. తమాషా యేమిటంటే- అన్ని వేళలా అక్కడ కూరగాయలు దొరకవు- ఒక్క సాయంత్రాలు తప్ప. అరుణ చేతిని పట్టుకొని నిల్చున్న రఘు. 'అమ్మా ఎవరీ ఆంటీ!' అంటూ ప్రశ్నించాడు.

"కోమలి ఆంటీరా! మీరింతవరకు చూడలేదుకదూ? ఉషా! ఆంటీకి నమస్తే చెప్పు-" అన్న మమ్మి (అరుణ) ఆజ్ఞను శిరసావహిస్తూ, కోమలినే చూస్తున్న పదేండ్ల పాప ఉష, "నమస్తే ఆంటీ" అంది చేతులు రెండూ జోడిస్తూ.

"ఓహో! నీ సంతానమన్న మాట. అది సరేకాని అరుణా! ఇంత తీరుబడిగా మార్కెటింగ్ చేస్తున్నావ్, యీ రోజు ఆఫీసుకు సెలవా ఏమిటీ?" అంది కోమలి.

"నేను ఉద్యోగం మానేసి చాల రోజులయిందిలే....! ఇంతకీ నువ్వు ఆంధ్ర ప్రదేశాన్ని పావనంచేసిందెన్నడోయ్? మి శ్రీవారికి ట్రాన్స్ఫరా....? కబుర్లేవిటి?"

"కబుర్లకేం.... చాలానే వున్నాయి;

అలా నడుద్దూ ఎమ్ టి. ఆర్. కేసి వెళ్దాం కాస్త కాఫీతాగుకుని కబుర్లువేసుకుందాం."

కోమలి. అరుణను – అరుణ పిల్లల్ని వెంటబెట్టుకుని హోటల్ ఎమ్. టి. ఆర్ కేసి నడిచింది.

హోటల్లో కూచున్నంత సేపు అరుణ కన్న ఎక్కువ వాగింది కోమలే. తమకు ఢిల్లీ నుంచి హైదరాబాదుకు బదిలీ అయినట్లు. తాను ఇక్కడే సెక్రటేరియెట్‌కి మార్పించుకున్నట్లు చెప్పింది. అరుణను. ఉద్యోగం మానేసినందుకు బోలెడు కోప్పడింది.

"ఈ మహానగరంలో మీవారికి వచ్చే నాలురాళ్ళతో ఎలా వేగుతున్నారే....? మా ఇద్దరి జీతాలుకలుపుకున్నా మాకు చాలడం లేదుకదా; అటువంటిది మీకెలా సరిపోతుందబ్బా? అయినా గ్రాడ్యుయేట్‌వికదా, పెద్ద సిటీలో వుంటున్నావ్– అవకాశంవున్నా ఎందుకు చేయడంలేదు వుద్యోగం?"–చీవాట్లేసింది కోమలి.

కోమలి మాటల్ని సహనంగా విన్న అరుణ చిన్నగా నవ్వేసింది. కోమలి స్వభావం అరుణకి కరతలామలకం. తాననుకున్నదే కరెక్టు అని నమ్మి. ఎదుటివాళ్ళని నమ్మించ ప్రయత్నిస్తుంది కోమలి. స్వీట్ తింటున్న అరుణ, అంతకు ముందే సెచ్చెలి తిట్లను తిన్న అరుణ. స్వీట్‌గా నవ్వుతూ, "కోమలీ: రేపు సెకండ్ సాటర్‌డే కదా! నీకూ, మీ వారికీ సెలవే. మీ పిల్లల్ని తీసుకొని మా యింటికిరండి." అంటూ మలక్‌పేటలో వుండే తమ ఇంటి అడ్రస్ ఇచ్చింది. పిల్లలకి ఒంటిపూట స్కూలు కనుక మధ్యాహ్నం అంతా వస్తామంటూ అరుణకి ప్రామిస్ చేసి. చిక్కడపల్లి బస్ సాప్ కేసి నడిచింది కోమలి. కాయగూరలతో పాటు కొంత పచారీ సామాను కొన్న అరుణ. పిల్లలిద్దరినీ తీసికొని రిక్షాలో ఇంటిదారి పట్టింది.

మూడింటికే వెళ్దామనుకున్న కోమలి తీరా ప్రయాణమై అరుణ ఇల్లు చేరేటప్పటికి అయిదున్నర అయింది. దారి పొడవునా విసుక్కుంటూనే వుంది. ఆలస్యమయిందని. పిల్లలు మాత్రం ఎంచేస్తారు పాపం! పెద్దదానిలంగా కనిపిస్తే దానిమీదికి జాకెటులేదు. "మాచింగ్ లేకుండా ఎలా వేసుకోనే అమ్మా...!" అంటుందా పిల్ల. ఆ జాకెటు ఆచూకీ ఎవరికి తెలుసు గనుక. పనిపిల్లనడిగితే "ఇదేం దమ్మగారో! నాకేటెరిక ....? గెక్కడి బట్టలు గక్కడ మడతేసి పెట్తూండగదా ....!" అంది. ఇక ఆ లంగా జాకెట్టు మానేసి స్కర్టు. బ్లౌజు వేసుకోమంటే — ఒక్కదానికి గుండీలు లేవు. ఎలాగో ఓలాగు పెద్దదానికి బట్టలు "చుటబెట్టి" చిన్నవాళ్ళిద్దరికి బట్టలు "తొడిగే"సరికి కోమలి తలప్రాణం తోకకొచ్చింది. అప్పటికీ శీను గొణుక్కుంటూనే వున్నాడు–తన బట్టలకు ఇస్త్రీ లేదని. గౌను కుట్లు వూడిపోయాయ్–కుటిపెట్టమని శశి గోల. ఎలాగో పిన్నులతో సరిపుచ్చి కోమలి డ్రస్ అయేటప్పటికి ఆమె భర్త ఆనందరావు తనూ తయారయ్యాడు. "చిన్న పిల్లల మీద విసుక్కుంటే ఎలాగ కోమలీ! నువ్వే అవన్నీ గమనించుకోవాలి." అన్న భర్తమీద చెప్ప లేనంత కోపం వచ్చింది కోమలికి. తనేం మనిషా మెషీనా ప్రొద్దస్తమానం వుద్యోగము చేసి వచ్చి. మళ్ళీ ఇవన్నీ చూసుకుందేంత టైమూ, ఓపిక ఎక్కడివీ? ఆ మాటే అందామనుకున్న కోమలి అనవసరంగా వాగ్వివాదాన్ని పెంచడం ఎందుకని మౌనంగా భర్తని అనుసరించింది.

మలక్‌పేట కాలనీలో గోపాలరావు ఇల్లు కనుక్కోవడంఏమంత కష్టంకాలేదు. రెండు పోర్షన్‌ల మిద్దెఇల్లు అది. క్రింద పోర్షన్‌లోనే గోపాలరావు వాళ్ళు వుంటున్నారు. మేడమీద ఇంకో లెక్చరర్ వుంటున్నాడు. గవర్నమెంటు క్వార్టర్స్–అన్నీ ఒక్కలాగే వుండి చూడడానికి ముద్దొస్తున్నాయ్.

కోమలి వాళ్ళను చూస్తూనే అరుణ "రండి ....రండి...."అంటూ వాళ్ళకి ఎదురేగింది. గోపాలరావుకూడా లేచి బయటకు వచ్చాడు. పరస్పర పరిచయ నమస్కారాలయ్యాక మొగవాళ్ళిద్దరూ బాతాఖానీలోకి పడ్డే, ఆడవాళ్ళిద్దరూ లోపలికి జారుకున్నారు. అరుణ పిల్లలు– రఘు, ఉష. కోమలి పిల్లలు– సుశి, శీను, శశి తోటలోకి వెళ్ళారు. ముందు ఆవరణలో స్థలం కొద్దిగానే ఉన్నా పూలమొక్కలు బాగానే పెంచింది అరుణ. మల్లె-విరజాజిమొక్కలు, మాలతీ సన్నజాజి పందిర్లు పొందికగా ఉన్నాయ్. కుండీల్లో గులాబీలు. కనకాంబరాలు. చామంతి, మరువం వంటిమొక్కలు మనోహరంగా ఉన్నాయ్. ఆడపిల్లలు పూలమొక్కలమీద పడ్డే. రఘు, శీను క్రికెట్టు ఆటకి వుపక్రమించారు.

వంటింట్లో స్టూలువేసి కోమలిని కూచోమంది అరుణ. "మా కోసం నువ్వేదో పెద్దపెట్టున ఏర్పాట్లు చేస్తున్నట్లున్నావే!" అంది కోమలి, వంటింటిని కలయజూస్తూ.

'అబ్బే.... అదేంలేదు కోమలా! నా వంట ఎప్పుడో అయిపోయింది. చపాతీలు వేడిగా వుంటేనే కాని బాగుండవని ఇంత వరకూ చేయలేదు...."

"నేనేమైనా సాయంపట్టనా ....?"

"ఓ యస్....ఆ గ్యాస్ స్టవ్ అంటించి పెనం పడేయ్. చపాతీలు కాలుస్తూ— కబుర్లుకూడా పేలుస్తువు కాని...."


"నా ఊకదంపుడు కబుర్లకేం కాని— ఇల్లు స్వంతమేనా ....?"


"రక్షించావ్ .... యా నీ మొగుడూ–పిల్లలూ స్వంతమేనా అనలేదు ....!"

"పెద్ద బడాయ్...."మై ఓన్" అంటూ బోర్డు వ్రాసి వాళ్ళవీపులకు తగిలించు...."

"కోప మెందుకే కోమలీ! ఇంటి విషయంకదా అడిగావ్. ఇల్లు స్వంతమనే అనాలి. ఇన్స్టాల్‌మెంటు బేసిస్‌మీద మాకు అలాట్ అయిన ఈ ఇంట్లోకి ఏడేండ్ల క్రితం మా (దూ) రాము."

"మొక్కలూ–అవీ–బాగానే పెంచినట్లున్నావ్. అయినా అరుణా....ఉష పుట్టిన





అజంతా బౌద్ధ విహారాలు

ఫోటో : కొమ్మెర్ల భిక్షు

## ఈ వరసింతే

ప్పుడు మానేసిన ఉద్యోగం మళ్ళీ మొదలెటలేదా?"

"పాత ధోరణిలోకి వెళ్ళిపోతున్న కోమలిని చూచి అరుణకి నవ్వొచ్చింది.

"కోమలీ! ఉద్యోగం.... ఉద్యోగం అంటావు కాని నాకసలు పై మెక్కదేడ్చిందే....!"

"భలే దానివే....! ముగ్గురు పిల్లల తల్లిని నేను చేయడం లేదూ..ఉద్యోగం"

"అవును.... నువ్వు మాత్రం ఎందుకు చెయ్యాలి?"

"వేన్నీళ్ళకి చన్నీళ్ళతోడు..."

'రామయ్యకి సీతమ్మ ఈడు-(నవ్వుతూ) ఇంతకీ మీ వారి జీతమెంతో చెప్ప విడవ్వోయ్......! అడగకూడని ప్రశ్నే అనుకో.... ఆత్మీయులం కనుక అరమరిక లేక అడుగుతున్నాను."

"దానికేముంది.... మా వారికి ఏడు వందలు. మరి మీ వారికో?"

"ఆరువందల యాభై."

"భలేదానివే! మరి ఉద్యోగం చేయనంటావేంటి? మా వారి ఏడువందలకు-నా మూడు వందలు కలిసినా మాకు సరిపోవడంలేదే....!"

"అయితే.... ఎంత మిగిల్చావేవిటి?" అంది అరుణ నవ్వుతూ.

"మిగల్చడమా! ఈ పట్టణాలలో! ఖర్చులుపోనూ అప్పులు కాకుంటే చాలు" చపాతిలు తీసి ప్రక్కన పెడ్తూ అంది కోమలి.

పైపు క్రింద చేయి కడుక్కుంటున్న అరుణ "మేము మాత్రం అప్పుల్లోమునిగి తేలడం లేదులే....!' అంది.

"ఈ కబుర్లకేం కాని అరుణా! పదేపదే అంటున్నానని అనుకోకు. చదువుకున్న దానివి కదా....! వుద్యోగంచేస్తే ఇంకాస్త బాగా బ్రతకొచ్చు; మరింత సుఖపడొచ్చు...."

కోమలి మాటలను మధ్యలోనే ఎదుర్కొన్న అరుణ. 'అయితే నీ ఉద్దేశ్యంలో మేము కష్టపడ పోతున్నామనా ....?" అంది.

"ఛా....ఛా....అదేం కాదు. నీ సంపాదనా తోడు అయితే మరికొంత మెరుగు కదా....అని."

కోమలిని ఇంకా యిలా మాట్లాడ నివ్వడం బాగలేదని నిశ్చయించుకుంది అరుణ.

వంటపని ముగించుకున్న స్నేహితురాండ్రిద్దరూ దొడ్లో గార్డెన్ చెయిర్స్ వేసుకొని టీపాయ్‌మీద మల్లెమొగ్గలు కుప్ప పోసి కటడం మొదలెట్టారు. దొడ్లో ముచ్చట గొల్పుతూంది కిచెన్ గార్డెన్. కాకర, పొట్లపాదులు-ఒకే పందిరికి అల్లుకుపోయి కొట్లాడుకుంటున్నట్లున్నాయ్. అటు ప్రక్కగా వున్న టొమాటో మొక్కలు పండ్ల బరువుకు వంగి గర్భిణీ స్త్రీని గుర్తుకు తెస్తున్నాయ్. పాదులవెంబడి బార్డర్‌లాగ పెంచిన ఎర్రతోటకూర. చుక్కకూర ఆకులు చూడముచ్చటగా ఉన్నాయ్.

మొక్కలవేపు మెచ్చుకోలుగా చూసిన కోమలి. "ఎంత బాగున్నాయోయ్.... ఈ మొక్కలూ పాదులు .... వెరీ హెల్దీ హాబీ....! అంది నవ్వుతూ.

"ఆ....ఏదోలేద్దూ.... స్థలంవుంది కదా. వూరికే వుంచడం ఎందుకని...." అరుణ కూడా నవ్వేసింది.

నెమ్మదిగా అసలు విషయంలోకి వచ్చింది అరుణ. "కోమలీ! వుద్యోగం చెయ్యడంలేదంటూ నన్ను దెప్పుతున్నావు కాని. నాకసలు టైమే వుండదు తెలుసా."

"అదిగో మళ్ళీ అదేమాట అంటున్నావు. మనస్సుండాలే కాని తీరుబడి వుండదా! ఉద్యోగాలు చేసే స్త్రీలందరూ పిల్లల తల్లులే అన్న విషయం మర్చిపోకు" కోపంగా వచ్చింది సమాధానం.

"ఏమో మరి! అది వాళ్ళవాళ్ళ మనస్తత్వాలని బట్టి వుంటుంది. నాకేమో అన్నీ పనులని పనిమనుషులకి అప్ప చెప్పడం ఇష్టం వుండదు" అంది అరుణ మంచి మొగ్గలను ఏరి కోమలికి అందిస్తూ.

"మనం అదనంగా రెండు మూడు వందలు సంపాదిస్తున్నప్పుడు ఓ యాభై రూపాయలిచ్చి పనిమనిషిని పెట్టుకున్నంత మాత్రాన తగ్గిపోయేది ఏమి లేదు లే!"

"డబ్బు సంగతి సరేనోయ్. కాని టైం ఎక్కడనించి పుట్టించను? పాప పుట్టుక ముందు మూడేండ్లు ఉద్యోగం చేశాను. ఆ సంగతి నీకు తెలుసుగా! ఇద్దరి సంపాదనా కలబోసుకొని ఇంటికి కావలసిన వస్తువులెన్నో కొనుక్కున్నాము. కాని. పాప పుట్టడం — దాని తర్వాత బాబు- పూర్తిగా గృహిణి జీవితానికి కట్టుపడిపోయాను. పసిపాపల సంరక్షణ పెద్ద దిక్కు- అంటూ ఎవరూ లేని నేను. పిల్లలు పెద్దవాళ్ళయ్యేవరకూ ఉద్యోగం చేయకూడదనే నిర్ణయించుకున్నాను. నిజం చెప్పాలంటే- కోమలీ- పిల్లల తల్లి అయిన ఏ స్త్రీ కూడా మరీ తప్పనిసరి పరిస్థితులో అయితే తప్ప ఉద్యోగం చెయ్యవలసిన అవసరం లేదనేదే నా సిద్ధాంతం. మరి నువ్వేమనుకున్నాసరే...."

అరుణ మాటలని శ్రద్ధగా ఆలకిస్తున్న కోమలి విసురుగ తలెత్తి చూసింది

"పిల్లలిద్దరూ స్కూళ్ళకి. శ్రీవారు కాలేజికి వెళ్ళాక గోళ్ళు గిల్లుకుంటూ కూచుంటావు కాబోలు! కాదు .... కాదు ఇరుగమ్మలతో పొరుగమ్మలతో పిచ్చాపాటి సాగిస్తావేమో కదూ!"

"అని నువ్వు అనుకోవచ్చు. నిజం చెప్పాలంటే - ఏ ఒక్క గంటో - గంటన్నరో తప్పితే. దినమంతా నాకు ఊపిరి పీల్చలేని పని."ఏమా ఆ పని" అని ఆశ్చర్య పోతున్నావు కదూ?- ఇంగ్లీషు పత్రికల లోని వ్యాసాలను తెలుగులోకి అనువదించి

పెడతాను. అకాడమీ వాళ్ల - ఇన్ని పదాలకి ఇంత అని - డబ్బు ఇస్తారు." కోమలి కొప్పులో మల్లెలమాల తురుముతూ అంది అరుణ.

"అలాగా!" అంది ఆశ్చర్యంగా కోమలి.

"ఇంతేకాదు.... మా ఇంట్లో తెల్లగడ్డ ఉతుకు చాకలి.... శుచిగా రుచికరమైన వంటలుచేసే చీఫ్ కుక్. అర్జంటుగా టపాల్స్ వైపు చేసి పెట్టే లేడీ టైపిస్ట్ ఒక్కటేమిటి.... గార్డ్‌నర్, బూట్‌పాలిష్ వాలా- టైలర్- డాక్టర్- యాక్టర్- వాట్‌నాట్? అన్నీ నేనే...." గలగలా నవ్వుతూ గంతులేస్తున్న అరుణను అసూయగా చూసింది కోమలి.

కోమలి మస్తిష్కం కొంత పనిచేయడం మొదలెట్టింది. తన ఇంట్లో వంట మనిషికి నలభై పని పిల్లకి పదిహేను— ట్యూషన్ మాష్టారుకి యాభై - నెల నెలా డాక్టరు బిల్లు కనీసం ఇరవై అయిదు. టైలర్‌కి సరే సరి అడపా దడపా పదీ పరకా. తనకి.... పిల్లలకి లంచ్ తెచ్చే అవ్వకి ఇరవై అయిదు. తన బస్సు చార్జీలు - ఇలా ఖర్చుల జాబితా భయపెట్టా కోమలికి కలవర పెట్టసాగింది. తన సంపాదనకు సరిపడా ఖర్చులు కనిస్తూనే వున్నాయ్. ఇంత సంపాదిస్తున్నా తన సుఖం ఏపాటి? అరుణ ఎంత నిర్విచారంగా, ఆనందంగా వుంది!—ఆలోచనలో పడిపోయింది కోమలి.

"లే ... లే .... కోమలీ! ఏదో నవ్వులాటకి ప్రారంభించిన మన వాగ్వివాదం చూస్తుంటే - కొంత బలం పుంజుకుంటున్నట్లుంది—నా పక్షాన'' అంది అర్థోక్తిలో అరుణ.

''నో....నో—" ఏదో చెప్పబోయింది కోమలి.

"సరేలే....పదపద .... మన శ్రీవార్లు ఇప్పటికే తిట్ల దండకం ప్రారంభించి వుంటారు. ఆకలి ఎక్కువై చపాతీలకు బదులు మనల్నే మింగేయగల సమర్థులు" అంటూ అరుణ కోమలిని వెంటబెట్టుకుని లోపలకు నడిచింది.

రాత్రి భోజనాలయ్యాక కోమలీ—ఆనందరావు తమ పిల్లలతో ఇంటికి బయలుదేరారు. దారి పొడవునా కోమలి బుర్రని ఆలోచనలు తొలిచేస్తూనేవున్నాయ్ అరుణ పిల్లలు ఎంతో ముద్దొస్తూ, ఎంతో క్రమశిక్షణతో వున్నారు. అదే తన పిల్లలో! ఎప్పుడూ పనివాళ్ళ చేతిలో పెరిగిన బాపతేమో, ఏ టైములో ఏం మాట్లాడాలో కూడా తెలీదు. తనెప్పుడూ ఇంటిపటున వుండకపోవడం వల్ల అదుపు ఆజ్ఞలు తక్కువయ్యాయ్. కోమలి ఆలోచనలు ఎక్కువై ఉద్రేకం హెచ్చడం మొదలైంది. ఇది గమనించిన ఆనందరావు నెమ్మదిగా ప్రసంగం అందుకున్నాడు "ఏమిటోయ్- తెగ ఆలోచిస్తున్నావ్? అరుణగారు పెట్టిన ఆవకాయను గురించేనా?"

ఇంతలో పెద్దది సుశి, "నాన్నగారూ! అత్త వేయించిన వడియాలు భలేగా వున్నాయ్." అంది.

"నాన్నా! వాళ్ళింట్లో బోలెడు మొక్కలు, పచ్చిమిరపకాయలు ఎన్నున్నాయ్ అనుకున్నావ్"!అంటూ మధ్యలో అందుకుంది శశి.

"వాళ్ళ రఘు.... ఎప్పుడూ క్లాసులో ఫస్టే అట నాన్నా!" శీను, రఘుని మెచ్చుకున్నాడు.

''అవున్రా! అరుణగారు ఎక్కడా ఉద్యోగం వెలగబెట్టరు కనుక ఇంటి పటున వుండి అవన్నీ చూసుకుంటారు. ఉద్యోగస్తురాలు మీ అమ్మ—ఆవిడకంత తీరుబడి, శ్రద్ధ ఎక్కడుంటాయ్? ఎవర్నో చూసి ఆనందించడమే మరి" అంటూ ఆనందరావు భార్యవేపు చూశాడు.

భర్తకి మొదటి నుండీ తను ఉద్యోగం చెయ్యడం ఇషం లేదని తెలిసిన కోమలి, ఇదే అదనుగ తనని హేళన చేస్తున్నాడని తెలుసుకొని, "అంటే మీ వుద్దేశ్యం నేను కూడా వుద్యోగం మానేసి వంటి ఇంటి కుందేలును అయిపోవాలనా" అంది వుక్రోషంగా.

"అబ్బే .... అబ్బే .... అంతమాట నేనంటానా? ఇంటిసంగతితర్వాత. ముందు మనం వుద్యోగంచేసి బ్యాంకు బాలెన్సు పెంచాలికదా?"

"అర్థమయింది లెండి మీరంటున్నది. నేను వుద్యోగంచేస్తూ వున్నాకూడా మనం బ్యాంకులో నిలవబెట్టింది లేదనేకదా మీ ఎత్తిపొడుపు మాటలు! అనండి....అనండి పడేదాన్ని నేనున్నానుగా," కోమలి కంఠం అప్పటికే నిండుకు రావడం చూసి, ఆనందరావు కొంత తమాయించుకున్నాడు.

"చూడు కోమలీ! నీకిష్టం వుంది, నువ్వు వుద్యోగం చేస్తున్నావ్! సంసారాన్ని ఆదుకుంటున్నానని గర్విస్తున్నావ్. మిగతా విషయాలను గురించి ఆ....ప్టే ఆలోచించే వ్యవధి లేదు నీకు. వుండు.... మధ్యలో అడ్డు తగలకు. అరుణ గారంటావా.... ఉద్యోగం వద్దనుకుంది. తన తీరిక వేళల్లో సాధ్యమైనంత వరకు తన కుటుంబ సంరక్షణకి, బాగోగులకి కృషి చేస్తోంది .మీరిద్దరూ కుటుంబ స్త్రీలే, కాని దారులు మాత్రం వేర్వేరు. మీ బాటలలోని బాగోగులను గురించి మీ రే నిర్ణయించుకోవాలి. ఇందులో కోపతాపాలకు తావు లేదు-" బస్సు రావడంతో వారి మాటలకు బ్రేకు పడింది.

పక్కమీద చేరిన కోమలికి అరుణ మాటలు మాటికిమాటికి గుర్తుకు రాసాగాయ్. తను కూడా అరుణలాగ ఉద్యోగం మానేసి పక్కా గృహిణిలాగా వుండిపోగలదా? అలా ఉండిపోతే తను శాంతిగా, సంతోషంగా బ్రతకగలదా? ఏమో అరుణ మనస్తత్వానికి ఆ జీవితం సరిపోవచ్చు.... మరి తనకో....

కానీ....కానీ....తను గానుగెద్దులాగ కష్టించి, భర్తని పిల్లల్ని ఏమాత్రం సుఖపెట్టగల్గుతున్నది? తన కష్టంవల్ల కాసింత సానుభూతిని కనీసం తన భర్తనించైనా పొందగల్గుతున్నదా? అరుణ చెప్పిన మాటలలో నిజంలేకపోలేదు. తన జీతంతో పాటు పెరుగుతున్నాయ్ తన ఖర్చులు; ఖర్చులకుపోటీ తన శరీరకష్టం. ఔను.... తనలాంటి గృహిణులు ఉద్యోగాలుచేసి పొందే సుఖంకన్నా, కష్టనిష్ఠూరాలే ఎక్కువేమో! అయినా, ఇప్పుడు మించిపోయిందేముందీ....? రేపు వుదయమే రాజీనామా కాగితాన్ని ఆఫీసరు మొహాన పారేసి, వుద్యోగపు బరువు బాధ్యతలనించి విముక్తి పొందితే సరి....ఆలోచిస్తూనే నిద్రపోయింది కోమలి.

వంట మనిషికి ఇంటి బాధ్యతలను అప్పజెప్పి, ఆదరా- బాదరగా భర్తవెంట ఆఫీసుకి బయలుదేరింది కోమలి. బస్సు సమయానికి దొరక్క, ఆఫీసు చేరడం ఆలస్యమయితే, ఆఫీసరుగారికి చెప్పుకోవలసిన సంజాయిషీని గురించి ఆలోచిస్తున్న కోమలికి- పాపం- నిన్నరాత్రి సంఘటనలు, తను తీసుకున్న నిర్ణయాలు, గుర్తు చేసుకొనేంత వ్యవధి ఎక్కడిదీ....?

★



"జలను తోడ్కొని...."

చిత్రం : ఉప్పరపల్లి శాతారావు